అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 12 జనవరి 2023

బాధిత కుటుంబానికి మంత్రి ఆర్థికసాయం

లక్ష్మణచాంద : ఇటీవల పీచర గ్రామానికి చెందిన కాల్వ సతీష్ నిర్మల్ జిల్లా జైలులో మృతి చెందగా బుధవారం బాధిత కుటుంబాన్ని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధితులకు అండగా ఉంటామని, ఆందోళన చెందొద్దని తెలిపారు. ఆయన వెంట డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, సర్పంచ్ బుర్రి లత భూమేష్, శాతం గంగారాం ఉన్నారు.



గుడిపేట్ కార్యదర్శి సస్పెన్షన్

నవతెలంగాణ - హాజీపూర్

మండలంలోని గుడిపేట్ జూనియర్ పంచాయతీ కార్యదర్శి ఎం.హరితను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ భారతిహోళికేరి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె అవినీతికి పాల్పడుతోందని ఎంపీటీసీ బాలరాజు, గ్రామస్తులు డీపీఓ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అదనపు కలెక్టర్ రాహుల్ విచారణ జరిపి పూర్తి నివేదికను అందజేయగా కలెక్టర్ చర్య తీసుకున్నారు. పంచాయతీ సమావేశాలు, గ్రామ సభల నిర్వహణలో వైఫల్యం, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం, తీర్మానాలను పక్కదోవ పట్టించడం, పంచాయతీ పోర్టల్‌లో పాత ఫొటోలు పెట్టడం, ఇంటి అనుమతుల విషయంలో అక్రమ వసూళ్లకు పాల్పడడం వంటి వాటిపై విచారణ జరిగింది.

హాజరు నమోదుకు అవరోధం..!

- మారుమూల ప్రాంతాల్లో వేధిస్తున్న సిగ్నల్ సమస్యలు
- అటెండెన్స్..రికార్డుల నమోదులోనూ అవాంతరాలు
- అవస్థలు పడుతున్న అంగన్‌వాడీ ఉపాధ్యాయులు
- ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్

ఆన్‌లైన్‌లో హాజరు నమోదుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన యాప్ అంగన్‌వాడీ ఉపాధ్యాయులను అవస్థలకు గురిచేస్తోంది. మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల్లోపు ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేయాలనే ప్రభుత్వ ఆదేశాలకు తిలోదకాలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ ఆదేశం ప్రకారం హాజరు నమోదు చేయాలని భావించినా సిగ్నల్ సమస్యలు వేధించడంతో తీవ్రంగా సతమతమవుతున్నారు. మరోపక్క రోజువారీ హాజరుతో పాటు పిల్లల బరువు, వివిధ రకాల రికార్డులను నమోదు చేయడం ఇబ్బందికరంగా మారుతోంది. క్షేత్రస్థాయిలో సమస్యలెదురవుతున్నా తప్పనిసరిగా హాజరు నమోదు చేయాలని అధికారులు ఒత్తిడి చేయడంతో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారు. ఇది వరకే పోషణ్ ట్రాకర్ యాప్ అందుబాటులో ఉండగా.. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌టీఎస్(న్యూట్రిషియన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్)యాప్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్‌లోనూ రికార్డులు నమోదు చేయడం అంగన్‌వాడీలకు సవాల్‌గా మారుతోంది. ఈ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

విధుల్లో పారదర్శకత కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్‌హెచ్‌టీఎస్ యాప్ అంగన్‌వాడీ ఉపాధ్యాయులను ముప్పుతిప్పలకు గురిచేస్తోంది. ఈ నెల 1 నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. ఉపాధ్యాయుల మాదిరిగానే అంగన్‌వాడీ ఉపాధ్యాయులు కూడా సంబంధిత యాప్‌లో రోజువారీగా హాజరు నమోదు చేసుకోవాలని స్పష్టం చేసింది. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల్లోపు తప్పనిసరిగా హాజరు నమోదు చేసుకోవాలి. లేదంటే ఆ రోజున గైర్హాజరుగా పరిగణించనున్నారు. దీంతో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారు. ఎందుకంటే ఉమ్మడి జిల్లాలో అనేక మారుమూల ప్రాంతాలు ఉంటాయి. కొండలు, కోనలు అధికంగా ఉండటంతో సెల్‌ఫోన్ సిగ్నల్‌లు రాని ప్రాంతాలు చాలా ఉన్నాయి. నాలుగేండ్ల క్రితం ప్రభుత్వం వీరికి ఫోన్లు అందజేసినా సిగ్నల్ సమస్యల కారణంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మరోపక్క ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 5వతేదీలోపు పిల్లల బరువులతో పాటు 14 రికార్డుల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఒక్కో



కేంద్రంలో 30 నుంచి సుమారు 100మంది వరకు 0- 6 సంవత్సరాలు కలిగిన పిల్లలు ఉంటారు. వీరందరి వివరాలు ఆన్‌లైన్‌లో కేవలం ఐదు రోజుల్లో నమోదు చేయడం అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు కష్టతరంగా మారుతోంది.

ఈ నూతన యాప్‌ను రద్దు చేయాలి : సునీత, అంగన్‌వాడీల సంఘం రాష్ట్ర కోశాధికారి



కేంద్రం తీసుకొచ్చిన పోషన్ ట్రాకింగ్ యాప్‌లో వివిధ రకాల వివరాలను నమోదు చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా హాజరు, రికార్డుల నమోదు కోసం ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను తీసుకొచ్చింది. సిగ్నల్ సమస్యల కారణంగా రోజువారీగా సమయానికి హాజరు నమోదు చేయడం అంగన్‌వాడీలకు ఇబ్బందిగా మారుతోంది. కేవలం తెలంగాణలోనే ఈ యాప్‌ను తీసుకొచ్చారు. ప్రభుత్వం వెంటనే ఈ యాప్‌ను రద్దు చేయాలి.

ఇప్పటికే పని ఒత్తిడితో ఇబ్బందులు : అన్నమొల్ల కిరణ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి



అంగన్‌వాడీ ఉపాధ్యాయులు ఇప్పటికే పనిభారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరితో ఐసీడీఎస్‌కు సంబంధం లేని పనులను చేయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో హాజరు నమోదు, రిపోర్టులను నమోదు చేయడంతో పాటు ఆఫ్‌లైన్‌లోనూ రికార్డులు రాస్తున్నారు. కాలం చెల్లించి ఫోన్లతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే నూతన యాప్‌ను రద్దు చేయాలి. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీసం వేతనం రూ.26వేలు అందించాలి.

తరగతులు నడిచేదెప్పుడు..?

ఆదిలాబాద్ జిల్లాలో 1235 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటి పరిధిలో సుమారు 1.50లక్షల మంది పిల్లలు, గర్భిణీలు తదితరులు వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ ఉపాధ్యాయులు రోజువారీగా 14 రకాల రికార్డులను నమోదు చేస్తున్నారు. స్టాక్‌తో పాటు పిల్లలకు సంబంధించి వివిధ రకాల రికార్డులను రిజిస్టర్‌లో నమోదు చేయాలి. ఆఫ్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత వాటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లోనూ నమోదు చేయాల్సి ఉంటుంది. ఎవరైనా నమోదు చేయని పక్షంలో సూపర్‌వైజర్లు, ఇతర ఉన్నతాధికారులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేతనం కట్ చేస్తామని బెదిరించడంతో వారు మరింత ఆందోళనకు గురవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ రికార్డులను నమోదు చేసేందుకు సమయం సరిపోతుంది. ఇక ప్రీ ప్రైమరి తరగతుల నిర్వహణకు సమయం ఎలా సరిపోతుందని కొందరు అంగన్‌వాడీ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక వీటితో పాటు బీఎల్‌ఓ విధులను కూడా నిర్వర్తించాల్సి వస్తోంది. ఇలా పని ఒత్తిడితో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు తీవ్రంగా సతమతమవుతున్నారు.

రెవెన్యూ, పోలీస్ వ్యవస్థను వాడుకుంటున్నారు..

- ఆంధ్ర కబంధ హస్తాల నుండి సిర్పూర్‌కు విముక్తి కల్పిస్తాం
- ప్రాంతీయ దోపిడీకి పాల్పడుతున్న కేసీఆర్
- షెడ్యూల్ 5లో ఉన్న అధికారాలు సర్పంచులకు అప్పగిస్తాం
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ - బెజ్జూర్

పోలీస్, రెవెన్యూ వ్యవస్థలను బీఆర్‌ఎస్ వాడుకుంటూ అణచివేసే ధోరణికి పాల్పడుతున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బహుజన చైతన్యయాత్ర రెండో విడతలో భాగంగా బుధవారం మండలంలోని నాగుల్వాయి, మర్తిడి, లుంబీనగర్, సులుగుపెల్లి గ్రామాల్లో బీఎస్పీ జెండాలను ఎగరవేసి యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ బీఎస్పీ రాజ్యాధికార ఆవశ్యకతను తెలియజేశారు. అనంతరం సులుగుపెల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఒక సిర్పూర్ ప్రాంతంలోనే ఆంధ్రా పాలన కొనసాగుతోందన్నారు. ప్రాంతీయ దోపిడీకి కేసీఆర్ పాల్పడుతున్నారని, రెవెన్యూ, పోలీస్ వ్యవస్థను వారి చెప్పుచేతల్లో పెట్టుకొని ఆడిస్తున్నారన్నారు. పత్తికి మద్దతు ధర లేక రైతులు నష్టపోతున్నారని, క్వింటాల్ పత్తికి రూ.15వేల వరకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ అధికారంలోకి రాగానే షెడ్యూల్ ఏరియాను స్వతంత్ర పాలనగా గుర్తిస్తామని, సర్పంచ్‌లకు అధికారాలు అప్పగిస్తామన్నారు. షెడ్యూల్ 5లో ఉన్న అధికారాలను సర్పంచ్‌లకు అప్పగిస్తామన్నారు. ధరణి పోర్టల్‌ను పూర్తిగా రద్దు చేసి రైతులకు మేలు చేస్తామన్నారు. పాత రెవెన్యూ వ్యవస్థను కొనసాగించడంతో పాటు వీఆర్‌ఏ, వీఆర్‌ఓలను



తిరిగి తీసుకొచ్చి వారికి వేతనాలు పెంచుతామన్నారు. బీసీ రిజర్వేషన్‌ను 50 శాతం పెంచడంతో పాటు వారికి తగిన ప్రాధాన్యతను కల్పిస్తామన్నారు. జూనియర్ లెక్చరర్ పోస్టుల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు మరో 10 రోజుల పాటు పొడిగించాలన్నారు. సుప్రీం కోర్టు రద్దు చేసిన గిరిజనులకు ఉపయోగపడే జీవో 3 కోసం రాష్ట్ర ప్రభుత్వం తిరిగి అప్పీల్ కోసం వెళ్లలేదని, దీన్ని బట్టి గిరిజనులపై కేసీఆర్‌కు ఎంత మమకారముందో తెలుస్తుందన్నారు. 317 జీవోతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ జీవో ద్వారా కుమురం భీం జిల్లాలో 1250 మంది నిరుద్యోగులకు నష్టం వాటిల్లుతుందన్నారు. పోడు భూములకు పట్టాలిస్తామని మభ్యపెట్టిన కేసీఆర్ ఇప్పటివరకు వారికి పట్టాలివ్వలేదని, తమ ప్రభుత్వం రాగానే పోడు భూములకు పట్టాలు అందజేస్తామని పేర్కొన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో అరాచక పాలన కొనసాగుతోందని, దాన్ని అంతమొందించే సమయం దగ్గరపడిందన్నారు. బెజ్జూర్ సర్పంచ్‌ను కలెక్టర్ అక్రమంగా తొలగించారని, అదే కాగజ్‌నగర్ మండలంలోని సర్పంచ్‌లపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. త్వరలో కోనప్పకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. సిర్పూర్‌లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, మురళీగూడ గ్రామాన్ని మరిచిన కోనప్ప అభివృద్ధి ఏదో చూపించాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్‌హుస్సేన్, బీఎస్పీ మండలాధ్యక్షుడు ఆత్రం సాయి, సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ రాంప్రసాద్, దుర్గం ప్రవీణ్, చిత్రు, సూర్ల ఇస్తారి, నందయ్య, సల్మాన్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ముందు ఆదివాసుల నిరసన

నవతెలంగాణ - కౌటాల

కుమురం భీం స్టేడియం కోసం కేటాయించిన స్థలంలో తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయవద్దని ఆదివాసులు గిరిజన నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో మూడు రోజుల క్రితం తెలంగాణ క్రీడా ప్రాంగణం కోసం కుమురం భీం స్టేడియానికి కేటాయించిన స్థలంలో చదును చేస్తుండగా ఆదివాసులు అడ్డుకున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ మునావర్ షెరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో పెట్టిన కేసలు వెంటనే ఉపసంహరించుకోవాలని, క్రీడా ప్రాంగణానికి వేరేచోట స్థలాన్ని కేటాయించాలని కోరారు. కేసులను వెనక్కు తీసుకోకుంటే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రాజ్‌గోండు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య అన్నారు. నిరసన కార్యక్రమంలో కొలావార్ సంఘం జిల్లా అధ్యక్షుడు మెర్పెల్లి బ్రహ్మయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారుపెల్లి పోశం, ఆదివాసీ గిరిజనులు ఉన్నారు.



పటిష్టంగా మారనున్న ప్రత్యామ్నాయ రోడ్డు

నవతెలంగాణ-జైపూర్

రాజీవ్ రహదారి నుండి రామారావుపేట వరకు గల ప్రత్యామ్నాయ రోడ్డును పటిష్టంగా నిర్మించనున్నారు. రామారావుపేట్ సర్పంచ్ నామాల సత్యవతి తిరుపతి, ఎంపీటీసీ పెద్దల బాబు ఆధ్వర్యంలో బుధవారం శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ సంజీవరెడ్డిని కలిసి రహదారి ఇబ్బందులను వివరించారు. రామారావుపేట నుండి సింగపూర్, సీతారాంపల్లి, తాళ్లపల్లి మీదుగా నస్పూర్ వరకు గల రోడ్డును శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గని విస్తరణలో భాగంగా మూత వేసిన తీరును గుర్తు చేశారు. ఈ క్రమంలో రామారావుపేట నుండి ఇందారం వరకు చెరువు కట్ట మీదుగా ఉన్న రోడ్డును విస్తరిస్తున్నప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదని జీఎంను కలిసి వివరించారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు చెరువు కట్టమీదగా భారీ వాహనాల రాకపోకలు నియంత్రించాల్సి ఉన్నందున ప్రత్యామ్నాయ రోడ్డును పట్టిష్టపరచాలని కోరారు. రామారావుపేట గ్రామ శివారులో గల వేలాది ఎకరాల వ్యవసాయ భూములు సింగరేణికి ధారదత్తం చేశామని, రామారావుపేట గ్రామం పూర్తి స్థాయి ప్రభావిత గ్రామమని జీఎంకు వివరించారు. ప్రత్యామ్నాయ రోడ్డును 100 ఫీట్లు వెడల్పు చేస్తూ అవసరమైన చోట పటిష్టమైన కల్వర్టులు నిర్మించి ఇవ్వాలని కోరారు. రోడ్డు పొడవునా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలకు అనుకూలంగా నిర్మించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన ప్రతినిధి బృందంలో ఉపసర్పంచ్ తంగళ్లపల్లి వెంకటేష్, గ్రామస్తులు ఉన్నారు. ఔ

గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే జరపాలి

నవతెలంగాణ-నస్పూర్

హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం సింగరేణిలో ఎన్నికలు జరపాలని ఏఐటీయూసీ జాతీయ నాయకులు విఎస్ బోసు, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.సీతారామయ్య అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్‌ని కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ లేబర్ కమిషనర్ మాట్లాడుతూ కోర్టు ఉత్తర్వుల ప్రకారం వారి కార్యాలయం నుండి ఇప్పటికి మూడుసార్లు లెటర్ పంపించామని, అందులో 17 యూనియన్లు స్పందించాయని, మిగిలిన యూనియన్ నాయకులు అందుబాటులో లేరన్నారు. ఎన్నికలు జరపటానికి వెంటనే చర్యలు తీసుకోకపోతే, యాజమాన్యం వెంటనే స్పందించకపోతే, రీజనల్ లేబర్ కమిషనర్ ఆఫీస్ వద్ద ధర్నా చేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా సింగరేణి యాజమాన్యంపై కోర్టు ధిక్కరణ కేసు కూడా వేస్తామని నాయకులు ఆర్‌ఎల్‌సికి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌ఎల్‌సి మాట్లాడుతూ యాజమాన్యానికి కూడా పంపించడం జరిగిందని, ఈ విషయంలో చీఫ్ లేబర్ కమిషనర్ కూడా పర్యవేక్షించడం జరుగుతుందని, వెంటనే ఎన్నికలు జరపడానికి తన వంతు చర్యలు చేపడతానని ఆర్‌ఎల్ సి హామీ ఇచ్చారని సీతారామయ్య తెలిపారు.

మట్టిని కాపాడుకోకుంటే మానవ మనుగడకే కష్టం

నవతెలంగాణ-ఖానాపూర్

మట్టిని కాపాడుకోకుంటే ముందు తరాలకు మనుగడ కష్టమవుతుందని ఈషా ఫౌండేషన్ వాలంటీర్లు పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఫ్లకార్డులతో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఈషా ఫౌండేషన్ వాలంటీర్లు మాట్లాడుతూ వ్యవసాయ భూములను సేంద్రియ పద్ధతుల ద్వారానే సాగు చేసుకోవాలన్నారు. అనవసరమైన యూరియాలు, మందులు వాడటం వల్ల భూమిలోని సారం పోతుందని తెలిపారు. ముందు తరాల మనుగడ కష్టసాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ మట్టిని పునరుద్ధరించే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వాలంటరీలు సత్యనారాయణ, ఆడెపు మధుకర్, ప్రవీణ్, రాజేష్, కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు రాగిజావ అందజేత

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ప్రతిరోజు రాగిజావ అందజేస్తామని సత్యసాయి భజన మండలి కన్వీనర్ నరసింహాచారి అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎలుకపెల్లి సర్పంచ్ గణపురం కావ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భానుప్రకాష్ విద్యార్థులకు రాగిజావను అందజేశారు. రాగిజావ ద్వారా విద్యార్థుల్లో రక్తహీనత తగ్గుతుందని, ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు వారిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి, సుజాత, సమ్మయ్య, నాగేష్, కళావతి, లక్ష్మి, గ్రామస్తులు నాగేష్, పోశన్న పాల్గొన్నారు.

కేవీటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - వాంకిడి

ఎంపీడీఓ కార్యాలయంలో కేవీటీఎస్ నూతన క్యాలెండర్‌ను జెడ్పీటీసీ అజయ్‌కుమార్, వైస్ చైర్మన్ సెండె రాజ్‌కుమార్, ఏఎస్ఐ పోచన్న బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ సామాజిక సమాఖ్య కుల వర్గ సంయుక్త సమాజ నిర్మాణం కోసం పోరాటం సాగిద్దామని, అన్ని వర్గాల అభ్యున్నతికి కేవీటీఎస్ ముందుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రావన్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, కేవీటీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, ఓయూ పీఆర్‌ఎసీపీ నాయకులు రాజ్‌కుమార్, గణేష్, కేవీటీఎస్ మండలాధ్యక్షుడు వినోద్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ - రెబ్బెన

పోలీస్ రిక్రూట్‌మెంట్ ఈవెంట్స్‌లో క్వాలీఫై అయిన అభ్యర్థులకు సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మెయిన్స్ రాత పరీక్ష కోసం ఉచితంగా శిక్షణ అందించనున్నట్టు బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు నెలల పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ తీసుకొనేందుకు ఆసక్తి ఉన్న ఈవెంట్సులో క్వాలీఫై అయిన అభ్యర్థులు ఈ నెల 18 సాయంత్రం 5 గంటల్లోపు ఆర్హత పత్రాలతో కూడిన దరఖాస్తులను జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో అందజేయాలని కోరారు.

జవహర్ నవోదయ పరీక్ష విధానంపై అవగాహన

వాంకిడి : మండలంలోని కిర్డీ గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు జవహర్ నవోదయ 5వ తరగతి పరీక్షకు దరఖాస్తు చేసుకొనే విధానంపై బుధవారం నవోదయ ఇంటర్ విద్యార్థిని సోయం రితిక, మండల విద్యాధికారి మనుకుమార్ అవగాహన కల్పించారు. విద్యార్థులకు మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవోదయ గురించి, అందులో జరిగే కార్యక్రమాలు విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భోజన వసతి, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉన్నత చదువుతో పాటు ఉద్యోగాలు కల్పించడంలో నవోదయ ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఇందూరావు, గణపతి పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి

బోథ్ : రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు అన్నారు. అఖిలపక్ష రైతు సంఘాలు తలపెట్టిన చలో కలెక్టరేట్‌కు నియోజకవర్గంలోని రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. రైతులతో పాటు బీఆర్‌ఎస్ కన్వీనర్లు ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు.

సీఎస్ శాంతికుమారికి ఆదిలాబాద్‌తో అనుబంధం



జిల్లా పర్యటనలో కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో శాంతికుమారి(ఫైల్)

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర నూతన చీఫ్ సెక్రటరిగా నియమితులైన ఎ.శాంతికుమారికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో అనుబంధం ఉంది. పాలనపరంగా ఆమె జిల్లాపై చెరగని ముద్ర వేశారు. ఆదిలాబాద్ పత్తి మార్కెట్‌లో మొదటిసారిగా ఎలక్ట్రానిక్స్ కాంటాలు ఏర్పాటు చేసి రైతుల పక్షాన నిలిచారు. దీనికి రైతులోకం జేజేలు పలికింది. మరో పక్క కాంటాలో మోసానికి చెక్ పెట్టినందుకు వ్యాపారులకు మింగుడు పడలేదు. ప్రజల పక్షాన ప్రత్యేకించి రైతులకు అండగా నిలిచిన ఆమె అనతికాలంలోనే బదిలీ అయ్యారు. ఆమెను ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకే ప్రభుత్వం బదిలీ చేసిందని, బదిలీని నిలిపేయాలని రైతులు ఆందోళనకు దిగారు. ఓ కలెక్టర్ బదిలీని నిలిపేయాని జిల్లా చరిత్రలో మొదటిసారిగా రోడ్డెక్కారు. ప్రజల పక్షాన నిలిస్తే వారు ఎన్నటికీ మర్చిపోరని, ఎక్కడున్నా, ఉద్యోగంలో ఉన్నతి సాధిస్తే గుర్తు చేసుకుంటారని ఆమెను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 1989 ఐఏఎస్ బ్యాక్‌కు చెందిన ఎ.శాంతికుమారి ఉమ్మడి ఆదిలాబాద్‌లో జిల్లాలో కలెక్టర్‌గా ఏప్రిల్ 30న బాధ్యతలు చేపట్టి నవంబర్ 11 వరకు పని చేశారు. కీలకమైన తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పలువురు ఆమెకు అభినందనలు తెలియజేస్తున్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



నవతెలంగాణ - దహెగాం

అడవుల సంరక్షణ అందరి బాధ్యతని ఫారెస్టు చీఫ్ కన్జర్వేటర్ వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఫారెస్టు నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలను పెంచడంతో పాటు వన్యప్రాణుల సంరక్షణ, అటవీ సంపదను కాపాడడంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలప అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. చంద్రపెల్లి శివారులో నూతన ప్లాంటేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు అటవీ సంరక్షణ గురించి, దానివల్ల కలిగే ఉపయోగాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తుండాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ ఆశిష్‌సింగ్, ఎఫ్‌డీఓ విజయ్‌కుమార్, ఎఫ్ఆర్ఓ అప్పలకొండ, డీఆర్ఓ శ్రీధరాచారి, ఎఫ్ఎస్ఓ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనంపై దాడి

ఇచ్చోడ : కాకతీయ యూనివర్సిటీ సెమిస్టర్ పరీక్ష 7వ రోజు పరీక్షలు రాస్తున్న సందర్భంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం మండల కేంద్రంలోని డిగ్రీ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. మాస్ కాపీయింగ్ పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. కొంత మంది దగ్గర నుంచి పేపర్లు తీసుకున్నారు. ఒక పరీక్ష కేంద్రం వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం కార్‌పై రాళ్లతో దాడి చేశారు. ఈ విషయంపై ఎస్సై ఉదయ్ కుమారు అడుగగా ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

సురక్షిత ప్రయాణం అందిరికి మేలు

నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రిలో రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా సిబ్బందికి సురక్షిత ప్రయాణం అనే అంశంపై బుధవారం అవగాహన కల్పించారు. డీవైసీఎంఓ ఆర్ శౌరి మాట్లాడుతూ రోడ్డుపై ఒకరి నిర్లక్ష్యం 10 మంది ప్రయాణికులకు శాపంగా మారుతుందన్నారు. ప్రతి ఉద్యోగి విధులకు హాజరవుతున్న సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఇంటికి చేరడానికి ఆలస్యమైన ఫర్వాలేదు కానీ ట్రాఫిక్ నిబంధనలు మరవ్వొద్దని తెలిపారు. చిన్నపిల్లలను ద్విచక్ర వాహనం వెనుకభాగంలో కూర్చోనివ్వొద్దన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డి.లలిత, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, టీబీజీకేయస్ పిట్ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి

నవతెలంగాణ-భీమారం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని మండల పరిధిలో విజయవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షాసమావేశంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీల వారీగా ఏర్పాటు చేయనున్న కంటివెలుగు కార్యక్రమానికి చేపట్టాల్సిన విధివిధానాలపై చర్చించారు. దీనికోసం ఆయా గ్రామ పరిధిలో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వాసంతి, జెడ్పీటీసీ భుక్య తిరుమల, గ్రామ సర్పంచులు, మండల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాగిజావ పంపిణీ

నవతెలంగాణ-కౌటాల

సత్యసాయి ట్రస్టు ద్వారా జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం 10.30 గంటలకు రాగిజావ పంపిణీ బుధవారం ప్రారంభమైంది. రాగిజావ బెల్లాన్ని కలిపి వేడిచేసి ప్రతిరోజు పాఠశాలల్లో పంపిణీ చేసే కార్యక్రమంలో గుండాయిపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల చైర్మన్ బట్టి శంకర్‌తో కలిసి ప్రధానోపాధ్యాయుడు గావుడె హన్మంతు పంపిణీ చేశారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ రాగుల పిండి, బెల్లం కలిపి తయారు చేసిన జావాను విద్యార్థులు తాగడంతో ఆరోగ్యం బాగుంటుందని, అనారోగ్యానికి గురికాకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాను మహారాజ్ జాతర క్రికెట్ ప్రారంభం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని పొట్య గ్రామపంచాయతీ బండారేవు తండాలో గల నాను మహారాజ్ జగదాంబ మందిరం 30వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఎంపీపీ మహిపాల్ రెడ్డి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్రికెట్ పోటీలు ధని - వైకుంఠపూర్ జట్లుతో ప్రారంభించారు. ఈ పోటీల్లో 29 జట్లు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల బంజారా నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

తెలంగాణ క్రీడా ప్రాంగణాలు త్వరితగతిన పూర్తి చేయాలని డీపీఓ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ సమావేశమందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ టీఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాల కోసం స్థల సేకరణ చేయాలన్నారు. స్థల సేకరణ చేసిన వాటికి నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు. మండలంలో ఇంతవరకు సేకరణ చేసిన స్థలాలు ఇంకను స్థల సేకరణ చేపట్టని గ్రామాలపై ఆరాతీశారు. ఈ నెలలో స్థల సేకరణ చేసి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దానితో పాటు ప్రతి పంచాయతీలో హరితహరం నర్సరీలను సిద్ధం చేయాలని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ పుష్పలత, ఈఓ సంజీవ్‌రావు, ఈజీఎస్. ఏపీఓ జాదవ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా ఓబన్న 216 జయంతి

నవతెలంగాణ-తలమడుగు

స్వతంత్ర సమర యోధుడు వడ్డె ఓబన్న 216వ జయంతిని సుంకిడి గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మొదటగా సమరయోధుడు ఓబన్న చిత్రపటానికి పాలభిషేకం చేశారు. అనంతరం వడ్డెర సంఘం నాయకులు రాజమల్లు మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న బ్రిటిష్ నాటి కాలంలో వ్యతిరేకంగా పోరాడిన ఘనత ఓబన్న దేనని అన్నారు. వీర యోధుడు ఓబన్న తన చిన్నతనంలోనే అవమానాలు ఎదుర్కొని ప్రజల కోసం ప్రజా పోరు చేసిన మహనీయుడని తెలిపారు. ఓబన్న 216వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గేల్లా మహేందర్ యాదవ్, మాజీ సర్పంచ్ ఆశన్న, కాంగ్రెస్ నాయకుడు వెంకట యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ప్రకాష్, వడ్డెర సంఘం నాయకులు బొర్రన్న, నర్సింలు, హనుమంతు, బాపురావు, మారుతి, నాగన్న, భీమన్న పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం అభినందనీయం

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం అభినందనీయమని జెడ్పీ చైర్మెన్ జనార్దన్ రాథోడ్, ఆసిఫాబాద్, బోథ్, సిర్పూర్ ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, రాథోడ్ బాపురావు, కోనేరు కోనప్పా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సోరత్ లక్కు నాయక్ నూతన పెట్రోల్ బంక్ ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరి బాయి, డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, స్థానిక సర్పంచ్ గజానంద్ నాయక్, లైవ్ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీరామ్ నాయక్, వైస్ ఎంపీపీ చంద్ర శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ నాగోరావ్, ఎంపీటీసీ పరమేశ్వర్, రేణుక బాయి, పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, ప్యాక్స్ డైరెక్టర్ కంతారావు దుర్గే, ప్రభాకర్, మహేందర్, కో అప్షన్ సభ్యులు దస్తగిరి, ఉపసర్పంచ్ మహేందర్, రామారావు రాథోడ్, దావుల రమేష్ ఉన్నారు.

పీఓడబ్ల్యూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని చింతల్‌చాంద గ్రామంలో బుధవారం పీఓడబ్ల్యూ, ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు, క్రీడలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి గంగా జమున, రెండో బహుమతి సరిత, మూడో బహుమతి సంగీత గెలుపొందారు. వీరికి పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి పీఓడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ లక్ష్మి, ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి కే రాజన్న, ఎస్. గంగన్నలు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కే.లక్ష్మి మాట్లాడుతూ ఆటలు శారీరకంగానే కాకుండా మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని కలిగిస్తాయని అన్నారు. ఈరోజు మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని అన్నారు. ఆయన మహిళలను రెండో శ్రేణి పౌరులుగా మాత్రమే చూస్తున్నారని మహిళలకు తగిన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా ప్రతిభకు తగిన గుర్తింపు దక్కాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనసూయ, సునంద, జమున, గంగవ్వ, రాజవ్వ, మహిళలు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

నవతెలంగాణ-కడెం

మండలంలోని నర్సాపూర్ గ్రామపంచాయతీలోని రెండు ఆదివాసీ గూడెల్లో చలి తీవ్రత ఎక్కువ ఉందని తెలియడంతో టీమ్ జనని ఆధ్వర్యంలో ఆదివాసీ కుటుంబాలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీమ్ జననీ సభ్యులు ఆదివాసీ కుటుంబాలలోని చదువుకుంటున్న విద్యార్థులతో విద్య అవకాశాలు ఆదివాసీలకు ఉన్నటువంటి అవకాశాలు పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జనని ఫౌండేషన్ అధ్యక్షులు తోట సుమిత్, టీమ్ జనని సభ్యులు అడ్వొకేట్ వెంకట్ మహేంద్ర, గాడ్పు భీమేశ్వర్, డాక్టర్ ప్రియాంక, మాస్టర్ శశాంక్, జిల్లేడు కుంట పటేల్, అంకుష్ రావు, అన్ని కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మారెడ్డి, పడగంటి కిష్టయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌కు చెందిన శరత్ మాక్సీ విజన్ కంటి దవాఖాన వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగులు, పోలీస్ డిపార్ట్‌మెంట్ (ఆరోగ్య భద్రత కార్డు కలిగిన వారు), సింగరేణి ఉద్యోగులు, జర్నలిస్టులకు నగదు రహిత శస్త్రచికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ సేవలు, హెల్త్ ఇన్సూరెన్స్, కార్డు కలిగిన వారికి సైతం చికిత్స నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

షీటీం సేవలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎవరైనా ఆకతాయిలు వేధిస్తే నిర్భయంగా షీటీమ్‌ను సంప్రదించాలని ఎఎస్ఐ, షీటీమ్ ఇన్‌చార్జ్ సునీత విద్యార్థులకు సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ గర్ల్స్‌లో విద్యార్థులకు షీటీమ్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, క్యూఆర్ కోడ్, పోక్సో యాక్ట్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అశోక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పెర్సపేన్‌ను దర్శించుకున్న ఉట్నూర్ ఎంపీపీ దంపతులు

నవతెలంగాణ-ఉట్నూర్

మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి గ్రామంలో గుడిరేవు వద్ద పద్మల్‌పూరి కాకో పెర్సపేన్ దేవతను పంద్రా వంశీయులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజలకు ఉట్నూర్ ఎంపీపీ దంపతులు పంద్రా జైవంత్ రావ్, ఘన్‌పూర్ సర్పంచ్ పంద్రా లత పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలో పుష్యమాసాన్ని పురస్కరించుకుని పంద్రా వంశీయుల ఆరాధ్య దేవతలకు పూజలు చేయడం ఆచారంగా వస్తుందన్నారు. పంద్రా వంశస్థులు ఎక్కడ ఉన్న దేవతలను దర్శించుకుని పూజల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంద్రా వంశీయుల పటేల్, కటోడ, ప్రధాన్, వంశస్థులు పాల్గొన్నారు.

వడ్డెరల హక్కుల కోసం పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి ఓబన్న



నవతెలంగాణ-ఉట్నూర్

వడ్డెరల హక్కులు, చట్టాల కోసం పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి ఓబన్ననేనని వైస్ ఎంపీపీ బాలాజీ అన్నారు. వడ్డే ఓభన్న జయంతి వేడుకలు బుధవారం స్థానిక వడ్డెర కాలనిలో వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైస్ ఎంపీపీ బాలాజీ హజరై ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ ఆనాడు, ఈనాడు వడ్డెర ప్రజలు ఎలాంటి అభివృద్ధి చెందలేదన్నారు. వడ్డెర ప్రజల సమస్యలపై అధికారులకు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల సాధనకు తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. అనంతరం వైస్ ఎంపీపీకి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ తన్నీరు నాగరాజు, మండల అధ్యక్షుడు ఒల్లెపు భుజంగ రావ్, బీఆర్ఎస్వీ యూత్ మండల అధ్యక్షుడు తన్నీరు సతీష్, కాలనీ వాసులు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో నూతనంగా నిర్మించిన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అంతకుముందు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన గిరిజన భవనం కోసం ఒక కోటి పది లక్షల రూపాయలతో భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఈ భవనంలో పండుగలు శుభకార్యలు చేసుకోవచ్చని సూచించారు. ఖానాపూర్ నియోజకవర్గంలో రైతుల కోసం రూ.500 కోట్లతో సదర్ మార్ట్ నిర్మించామని అన్నారు. రెండో పంటకు ఎస్సారెస్పీ నుండి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. గత భారీ వర్షాల కారణంగా కడెం ప్రాజెక్టు ఇబ్బందికరంగా కూలిపోయే పరిస్థితి ఏర్పడినప్పుడు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతుల కోసం దాదాపు మూడు కోట్లతో పనులను చేపట్టినట్లు వివరించారు. ఎమ్మెల్యే రేఖా నాయక్ నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు ఉన్న ఆ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలతో పాటు మూడు లక్షల రూపాయలు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రేఖ నాయక్, విఠల్‌రెడ్డి జిల్లా పాలనాధికారి ముషారఫ్ అలీ ఫారూఖీ, అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఆర్డీఓ స్రవంతి, డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐ అజయ్‌బాబు, పెంబి ఎస్సై రజనీకాంత్, మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్, వైస్ చైర్మెన్ ఖలీల్, మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు, ఖానాపూర్ పీఏసీఎస్ చైర్మెన్ డీసీసీబీ డైరెక్టర్ ఇప్ప శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ మోహిత్, సత్తెనపల్లి పీఏసీఎస్ చైర్మెన్ ఆనంద శ్రీనివాస్, ఎంపీడీఓ మల్లేష్, నాయకులు రామ్‌చరణ్, వెంకటప్పయ్య, పరిమి సురేష్, పుష్పాల గజేందర్ ఉన్నారు.

కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ అన్నారు. బుధవారం ఖానాపూర్‌లో గిరిజన భవన్‌ను ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 2వ విడత కంటి వెలుగు కార్యక్రమం విజయవంతానికి అందరూ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల కంటి సమస్యలు దూరం చేసేందుకు కృషి చేస్తుందని అన్నారు. ఈ నెల 18వ తేదీ నుండి 100 రోజుల పాటు 2వ విడత కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించాలనే ఉద్దేశ్యంతో ప్రణాళికలు రూపొందించి అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. శిబిరాలపై క్షేత స్థాయిలో ప్రచారం చేయాలని తెలిపారు. ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం ద్వారా అందుబాటులో కంటి వెలుగు శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, కంటి అద్దాలు అందించడం జరుగుతుందని అన్నారు. గ్రామసర్పంచ్, ఎంపీటీసీలు వారి పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ధన్‌రాజ్, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, వైద్యాధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాన్పమేడిగూడ కెనాల్ స్కూల్ కాంప్లెక్స్‌లో బుధవారం కాంప్లెక్స్ ఉపాధ్యాయులతో కలిసి టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలు జనవరి 13, 14 తేదిలలో బీఎంఆర్ సార్థా కన్వెన్షన్స్ హల్, మన్నెగూడ, సాగర్ రోడ్, రంగారెడ్డిలో నిర్వహించడం జరుగుతుందని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు నైతం గణేష్ అన్నారు. ముఖ్య అతిథిగా విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, చుక్క రామయ్య, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రొఫెసర్ నాగేశ్వర్ వస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాన్పమేడిగూడ కెనాల్ స్కూల్ కాంప్లెక్స్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు, నాయకులు నారాయణ, దిలీప్, పెంటపర్తి ఊశన్న, భవాని ఆనంద్, దశరథ్, దిలీప్, రాములు, వినోద్, అరుణ్, రాజు పాల్గొన్నారు.

గైర్హాజరైన అధికారులపై చర్యలేవీ..?



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలేవని, అన్నిశాఖల మండల అధికారులు, ఎంపీటీసీలు సర్పంచ్‌లు తప్పకుండా హాజరుకావాలని ఎంపీటీసీలు పొరెడ్డి శ్రీనివాస్, సోంటకే గజానంద్‌లు అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం ఆదరణ లేకుండా పోతుందని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగా మండల వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు రబీ పంటలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు, కొత్త పట్టాదారు రైతులకు రైతుబంధు, రైతు బీమా అందే విధంగా దరఖాస్తులు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. ఆనంతరం పశు వైద్యాధికారి పర్విద్ హైమద్ మాట్లాడుతూ ఉచితంగా పశువులకు, మేకలకు, గొర్రెలకు టీకాలు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపీఓ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 18న కంటి వెలుగు తెలంగాణ రాష్ట్రంలో కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఈ పథకం రూపుదిద్దుకుందని అన్నారు. ఈ పథకాన్ని ప్రభుత్వ ఖర్చుతో ఉచితంగా అన్ని గ్రామాల ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లద్దాలు, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, మందులను అందజేస్తుందని పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ సర్వసభ్య సమావేశా నికి ఆదరణ లేకుండా పోతుందని అన్నారు. ప్రతి ఎంపీటీసీ, సర్పంచ్‌లు తెలియజేసే సమస్యలు పరిష్కారం కావాలని, తెలిపిన అధికారులు పట్టించుకోవడం లేదని, ఆర్‌అండ్‌బి అధికారులకు ఎన్ని సార్లు విన్నవించిన రోడ్డుపై ఉన్నగుంత ప్రమాదకరంగా ఉందని తెలియజేసిన దాన్ని బాగు చేయలేదని ఆసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారి సదానందం మాట్లడుతూ మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పలు పాఠశాలలో మరమ్మతులు జరుగుతున్నాయని, దేగామ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల్లో ఫ్లోరింగ్ పాడైపోయి తేళ్ళ, పాములతో విద్యర్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పాఠశాలకు ప్రహరీ గోడ, గదుల్లో ఫ్లోరింగ్ చేయించాలని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ అధికారి దేగామ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ లేక ఇబ్బందవుతుందని తెలియజేశారు. రైతులు విద్యుత్ కోసం విద్యుత్ శాఖ అధికారులకు ధరఖాస్తు చేసుకోవాలని అన్నారు. రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు విద్యుత్ లైన్ వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులకు 12 గంటల విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు. రైతులకు విద్యుత్ కోతలు జరుగుతున్నాయని, 140 రైతుల డీడీ లు పెండింగ్‌లో ఉన్నాయని వైస్ ఎంపీపీ శ్రీనివాస్ అడుగగా త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. లక్ష్మణ్ నాయక్ తండ సర్పంచ్ ఇంటి ముందు విద్యుత్ స్తంభం పడి మూడు నెలలు గడుస్తున్నా దాన్ని బాగు చేయలేదని సర్పంచ్ ఆడే శ్రీరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీఓ శ్రీనివాస్ మాట్లడుతూ మండలంలో రూ.4 కోట్ల 70 లక్షలు చెల్లింపులు చేయడం జరిగిందని, ఇంకా రూ.60 లక్షలవరకు నిధులు లేక చెల్లించలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జయశ్రీ, జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, తహసీల్దార్ గంగాధర్, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, ఎంపీడీఓ రాధా, ఎంపీఓ మహేందర్ రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ వర్ధంతి

- హైమన్ డార్ఫ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైమన్ డార్ఫ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం(టీఏవీఎస్) జిల్లా అధ్యక్షులు తుంరం ఈశ్వర్, కార్యదర్శి బైరి సోమేశ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీఏవీఎస్ కార్యాలయంలో హైమన్ డార్ఫ్ దంపతులకు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుమురం భీం, జల్, జంగల్, జమీన్ కోసం చేసిన పోరాటానికి ఆనాటి నైజాం ప్రభుత్వం అధ్యాయనానికి హైమన్ డార్ఫ్‌ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు పంపిందని అయన ఇక్కడి ఆదివాసీల సమస్యలను ప్రభుత్వానికి పంపి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని గుర్తు చేశారు. ఈనాటి రాయిసెంటర్, గిరిజన దర్బార్, ఐటీడీఏలలో కనీస పథకాలు ఆదివాసీలకు అందించాలని మొట్టమొదట నివేదించారని అన్నారు. వారి జీవితం మొత్తం ఆదివాసీల మధ్య జీవిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. వారి ఆశయ సాధనకై తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు కనక మల్కు, ఆడ అర్జున్, కుర్సెంగా మారుతీ, పూసం గణేష్, కుమురం దీపక్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై మెయిన్స్ పరీక్షల కొరకు గిరిజన యువతకు 3 నెలలు ఉచిత భోజనం, వసతితో కూడిన శిక్షణ అందించడం జరుగుతుందని ఐటీడీఏ పీఓ కె.వరుణ్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల పోలీస్ కానిస్టేబుల్, ఎస్సైకి పరీక్ష రాసి ఇటీవల నిర్వహించిన ఫిజికల్ ఫిటినెస్‌లలో ఉత్తరులైన గిరిజన అభ్యర్థులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు తమ యొక్క ఫిజికల్ టెస్ట్, అడ్మిట్ కార్డుతో పాటు, అన్ని నిజధృవీకరణ పత్రాలతో పాటుగా ఒక పాస్ పోర్ట్ సైజు ఫోటోతో ఉట్నూరు కేబి కాంప్లెక్స్ యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో అడ్మిషన్లు తీసుకోని రావాలని అన్నారు. ఈ ఉచిత శిక్షణను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 7893616392, 9493535052, 9666748105 ఫోన్ నెంబర్లులకు సంప్రదించాలని పేర్కొన్నారు.

మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత కార్యదర్శులదే

- ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డి

నవతెలంగాణ-భైంసా

గ్రామాల్లో పెంచుతున్న మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత గ్రామపంచాయతీ కార్యదర్శులదేనని ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డి సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విధులపట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని సూచించారు. పింఛన్‌దారులు చనిపోతే వెనువెంటనే వారికి సంబంధించిన సమాచారాన్ని తక్షణమే అందజేయాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. ఉపాధి హామీకి సంబంధించిన పనుల ప్రణాళికను రూపొందించాలన్నారు. సమావేశంలో మండల పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రానికి చెందిన ఆకుల బాలాజీ (52) మద్యానికి బానిసై బుధవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలిసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకుల బాలాజీ మద్యానికి బానిసై అప్పులు కావడంతో అవి ఎలా తీర్చలనే బెంగతో మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో గ్రామానికి సమీపంలో ఉన్న వాగు ఒడ్డున ఉన్న రావి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

తోటి పోలీసు ఉద్యోగి బ్లడ్ క్యాన్సర్‌తో మృతి చెందగా ఉద్యోగులంతా కలిసి ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. ఇటీవల మండలంలోని దేగామ గ్రామానికి చెందిన సివిల్ పోలీస్ కానిస్టేబుల్ ఉయిక నగేష్ బ్లడ్ క్యాన్సర్‌తో మరణించారు. విషయం తెలుసుకున్న తన తోటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సివిల్ పోలీస్ కానిస్టేబుల్(2012-బాచ్) ఉద్యోగులందరూ కలిసి నగేష్ కుటుంబ సభ్యులకు రూ.15వేల నగదుతో పాటు ఇద్దరు ఆడ పిల్లలకు ఒక్కొక్కరికి రూ.లక్షా చొప్పున సుకన్య సమృద్ధి యోజన పాలసీకి డబ్బులు అందించారు. మొత్తం రూ.2లక్షల15వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఇక ముందు కూడా మేము మీకోసం ఉన్నామనే భరోసా కల్పించారు.

గ్రూప్-2 అభ్యర్థులకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ పాసైన అభ్యర్థులకు ఆదిలాబాద్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్-2 ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్టు స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉచిత శిక్షణ కొరకు ఈనెల 12 నుండి 20 తేదీ వరకు ఆన్‌లైన్‌లో లేదా బీసీ స్టడీ సెంటర్‌లో బీసీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు స్టడీ సర్టిఫికెట్స్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిగ్రీ మార్కులు ఆధారంగా ఎంపిక చేయబడిన 100 మంది అభ్యర్థులకు 90 రోజుల పాటు ఉచిత శిక్షణ అందజేస్తామని తెలిపారు. వివరాలకు ఈ 08732221280 నెంబరును సంప్రదించాలని సూచించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జిగా నియమితులైన మాణిక్ రావు ఠాక్రేను మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్ర రెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం పలు విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు డా. నరేష్ జాదవ్ ఉన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని జెడ్పీచైర్మెన్ జనార్దన్ రాథోడ్ అన్నారు. బుధవారం దీక్ష భూమి కొత్తపెల్లి(హెచ్)లో44 గురుకృప దినోత్సవం సందర్భంగా ఆసిఫాబాద్, బోథ్, సిర్పూర్ (టి), ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, రాథోడ్ బాపురావు, కోనేరు కొనప్ప, ఎంపీ సోయం బాపురావు జగదాంబాదేవి, సేవాలాల్ ఆలయంలో పీఠాధిపతి ప్రేమ్‌సింగ్ మహారాజ్ ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం భక్తులను ఉద్దేశించి హితబోధ పలికారు. ఆలయాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అంతకముందు గంగాపూర్ నుండి దీక్ష భూమి కొత్తపెల్లి వరకు 44వ గురుకృప దినోత్సవ ఉత్సవాల్లో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ పల్లకి ఊరేగింపు శోభాయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ పల్లకి ఊరేగింపు ముందు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శోభాయాత్రను బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుతో పాటు ప్రముఖులు ప్రారంభించారు. దీనితో శోభ యాత్ర దేవత మూర్తుల పల్లకి యాత్ర భక్తులను ఆకట్టుకున్నాయి. దీక్ష భూమి జాతరకు భక్తజనం వివిధ రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో లంబాడీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డా.జాదవ్ రాజ్ కుమార్, రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు ఈశ్వరి బాయి, నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, వైస్ ఎంపీపీ చంద్ర శేఖర్, ప్యాక్ ఇన్‌ఛార్జి సురేష్ అడే, పవార్ దేవిదాస్, సుధాకర్ నాయక్, వసంత్‌రావు, రవీందర్, ఆడే ప్రకాష్, ఆలయ కమిటీ సభ్యులు నరహరిదాస్, డిగాంబర్, రామేశ్వర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నిరుద్యోగ గిరిజన యువతకు 3 నెలల ఉచిత శిక్షణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నిరుద్యోగ గిరిజన యువతీ యువకులకు మూడు నెలల పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై మెయిన్స్ పరీక్షలకు గిరిజన యువతకు 3 నెలలు ఉచిత భోజనం, వసతితో కూడిన శిక్షణ అందించడం జరుగుతుందని ఐటీడీఏ పీఓ కె.వరుణ్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు ఫిజికల్ ఫిటినెస్ (పార్ట్-2) ఉత్తరులైన గిరిజన అభ్యర్థులు తమ యొక్క ఫిజికల్ టెస్ట్, అడ్మిట్ కార్డుతో పాటు, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, ఒక పాస్ పోర్ట్ సైజు ఫోటోతో ఉట్నూరు కేబీ కాంప్లెక్స్ యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో అడ్మిషన్లు తీసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7893616392, 9493535052, 9666748105 నెంబర్లలకు సంప్రదించాలని తెలిపారు.

పదోన్నతి పత్రాలు అందజేసిన జీఎం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని సీహెచ్‌పీ ఉద్యోగులకు ఎస్ఎల్‌పీ పదోన్నతి పత్రాలను సీహెచ్‌పీ డీజీఎం డీవీరావు ఆధ్వర్యంలో బుధవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి మాట్లాడుతూ ఎస్ఎల్‌పీగా ఉద్యోగున్నతి పొందిన సీహెచ్‌పీ ఉద్యోగులను అభినందనలు తెలిపారు. రోజుకు మూడు రేకులు రవాణా చేస్తున్న పీహెచ్‌పీని 5 రేకులు రవాణా చేసేందుకు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా రక్షణతో కూడిన బొగ్గు రవాణా చేయాలని సీహెచ్‌పీ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ప్రమోషన్ పొందిన ఉద్యోగులు మరింత ఉత్సాహంగా పని చేయాలని అన్నారు. కార్యక్రమానికి ఎస్ఓ టూ జీఎం త్యాగరాజు, ఏజీఎం(ఈ అండ్ ఎం) రమేష్ బాబు, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ సురేందర్‌రెడ్డి, జనరల్ షిఫ్టు ఇంజినీర్ బి. మోహన్ ఈఈ(ఈ అండ్ ఎం), వి.సదయ్య ఏఈ(ఈ అండ్ ఎం), సీహెచ్‌పీ పిట్ సెక్రటరి శ్రీనివాస చారి పాల్గొన్నారు.

పోలీస్ అభ్యర్థుల జీవితాలతో చెలగాటం

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోలీస్ అభ్యర్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గుడిసెల కార్తీక్ ఆరోపించారు. ప్రభుత్వం తీరుపై జిల్లా కేంద్రంలో బుధవారం ప్లాకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సై కానిస్టేబుల్ నియామకాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని చలో ప్రగతి భవన్ ముట్టడి పెడితే ముందస్తుగా అరెస్టు చేయడం సిగ్గుచేటని, ప్రగతి భవన్ ముట్టడికి వెళ్ళిన విద్యార్థి యువజన సంఘాల నాయకులు కార్యకర్తలు, కానిస్టేబుల్ అభ్యర్థులపై పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా పోలీసులు నియామకాలను తప్పులతరకక నిర్వహించి అభ్యర్థుల జీవితాలతో చెలగాటం ఆడడం సరికాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పాత పద్ధతిలో కొనసాగించి కోర్టు తీర్పును అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి జాఫర్, డీవైఎఫ్ఐ నాయకులు కిరణ్ పాల్గొన్నారు.

బీఎస్సీ హార్టికల్చర్‌లో సీటు సాధించిన సీఓఈ విద్యార్థి

నవతెలంగాణ-తాండూర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సిఓఈ)బెల్లంపల్లి విద్యార్థి సెండే విఘ్నేష్ కాలేజి ఆఫ్ అర్టికల్చర్, మోజర్ల (వనపరి)లో బీఎస్సీ(హానర్స్) హార్టికల్చర్‌లో సీటు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. 2020-2023 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్స్ కోసం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ నిర్వహించిన ఎంసెట్ కౌన్సిలింగ్ విఘ్నేష్‌కు సీటు కెటాయించారని తెలిపారు. ఈ సందర్భంగా విఘ్నేష్‌ను బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆర్‌సీఓ కొప్పుల స్వరూప రాగం, అధ్యాపకులు అభినందించారు.

మల్కేపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-కాసిపేట

ఉట్నూర్ ఐటీడీలో నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో మండలంలోని మల్కేపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ప్రతిభ కనభరిచారు. ఎనిమిదో తరగతి విద్యార్థి దూడ అన్వేష్, ఐదోవ తరగతి విద్యార్థి మెస్రం మారుతీలకు అగ్రికల్చర్ అండ్ ఫుడ్ సేఫ్టీలో, హాట్ వాటర్ విత్ జీరో ప్రైస్ ఇన్ అనే ప్రాజెక్టు మూడో బహుమతి సాధించారు. ఈ మేరకు ఐటీడీఏ పీఓ వరుణ్ రెడ్డి, తదితర అధికారుల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ మేరకు పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతి సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వేములవాడ రమేశ్, ఉపాధ్యాయులు చంద్రమోళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మద్దిమాడ, కోమటిచేనులో గ్రామ సభలు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని మదిమాడ, కోమటిచేను గ్రామ పంచాయతీల్లో బుధవారం 2023-24 సంవత్సరానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై గ్రామ సభలు నిర్వహించారు. అభివృద్ధి ప్రణాళికలపై చర్చించి తీర్మాణాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రొడ్డ లక్ష్మీ ఎంపీడీఓ ఎంఏ అలీం, సర్పంచ్ ఆడె జంగు, కోమటిచేను సర్పంచ్ రాంటెంకి శ్రీనివాస్, ఎంపీఓ నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిలో రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా బుధవారం సిబ్బందికి సురక్షిత ప్రయాణం అంశం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం శౌరి మాట్లాడుతూ రోడ్డుపై ఒక్కరి నిర్లక్ష్యం పది మంది ప్రయాణికులకు శాపంగా మారుతుందన్నారు. ప్రతి ఉద్యోగి విధులకు హాజరవుతున్న సమయంలో తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఇంటికి చేరడానికి ఆలస్యమైనప్పటికీ ట్రాఫిక్ నిభంధనలను మరవద్దని చెప్పారు. చిన్న పిల్లలను ద్విచక్ర వాహనం వెనుక భాగంలో కుర్చోనివ్వోద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డీ.లలిత గారు, మెడికల్ సుపరింటెండెంట్ డాక్టర్ రాధా కృష్ణ కేజీబీకేఎస్ ఫిట్ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

యువతిని కిడ్నాప్ చేసిన నిందితుల అరెస్ట్

నవతెలంగాణ నస్పూర్

నస్పూర్ ఏరియాలోని అంబేద్కర్ కాలనీకి చెందిన యువతిని కిడ్నాప్ చేసిన నిందితులను బుధవారం సీసీసీ పోలీసులు అరెస్టు చేశారు. సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుడిపెల్లికి చెందిన ఆమె బంధువు శంకర్ గత కొంతకాలంగా ప్రేమ పేరుతో, పెళ్లి చేసుకుంటానని వేధిస్తున్నాడని, యువతి కుటుంబ సభ్యులు దీనికి నిరాకరించడంతో పగ పెంచుకొని పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశ్యంతో యువతిని మరో ముగ్గురితో కలిసి కిడ్నాప్ చేశాడు. యువతి మంగళవారం సాయంత్రం కాలేజీ నుండి బస్‌లో నస్పూర్‌కి వచ్చి అంబేద్కర్ కాలనీ దగ్గర దిగగా శంకర్ మిగిలిన ముగ్గురి సాయంతో ఆటోలో కిడ్నాప్ చేసి కోటపెల్లి మండలం నాగంపేట్ వైపు వెళుతుండగా కోటపల్లి దగ్గర యువతీ 100 డయల్ ద్వారా కోటపల్లి పోలీసులు సమాచారం ఇవ్వగా కోటపల్లి పోలీస్‌లు వెంటనే పట్టుకొని వారి తండ్రికి అప్పగించారు. పోలిసుల రాకతో పారిపోయిన నలుగురు నిందితులలో ముగ్గురు శంకర్, అంజన్న, అభిషేక్‌లని బుధవారం నస్పూర్ సీసీసీ కార్నర్‌లో అరెస్ట్ చేశామని, మరొకరు పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

అంగరంగ వైభవంగా గోదాదేవి కల్యాణం

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని పొన్నకల్ గ్రామంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రోజున రంగనాయక గోదాదేవి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. జక్కు సత్తయ్య భాగ్యలక్ష్మి, హరిదాస్ దంపతులు కల్యాణంలో కూర్చున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. కళ్యాణంకు వచ్చిన భక్తులకు రాజకిషన్ దంపతులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పోన్కల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జక్కు భూమేష్ విలేజ్, డెవలప్మెంట్ కమిటీ ప్రెసిడెంట్ అంజి, భూమా చారి గ్రామ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

జీతాలు అడిగితే అరెస్టులు చేస్తారా..?



నవతెలంగాణ-హాజీపూర్

జీతాలు అడిగితే అరెస్టులు చేయడమేంటని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ అన్నారు. తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్స్ డైలీ వైస్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల ఎదుట బుధవారం అక్రమ అరెస్టులను నిరసిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దుంపల రంజిత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, హాస్టల్స్‌లో పని చేస్తున్న అన్ని రకాల వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, 23 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులను సీఎం పర్యటన నెపంతో అన్యాయంగా అరెస్టు చేశారన్నారు. ఈ అక్రమ అరెస్టులను ఖండిస్తూ, అరెస్టు చేసిన నాయకులను, కార్మికులను తక్షణం విడుదల చేయాలి డిమాండ్ చేశారు. వేతనాలు రాకపోవడంతో భద్రాచలం స్థానిక జిల్లా గిరిజన అధికారులకు, ఎమ్మెల్యేకు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌కి అనేకసార్లు వినతి పత్రాలు అందజేశారన్నారు. అయినా స్పందించకపోవడంతో సమ్మె చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలకు ప్రతి ఏటా లక్షలాది జీతాలు ఇస్తున్న ప్రభుత్వం, గిరిజన కార్మికులను, కుటుంబాలను పస్తులు ఉంచుతుందన్నారు. రాష్ట్రంలో 22 నెలల నుంచి వేతనాలు రాక కుటుంబాలు పస్తులు ఉంటుంటే ముఖ్యమంత్రికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అరెస్టు చేసిన నాయకులను, కార్మికులను వెంటనే విడుదల చేసి తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా కూడా గిరిజన సంక్షేమ హాస్టల్ల ఎదుట కలెక్టర్, గిరిజన కార్యాలయాల ఎదుట ఆందోళనల చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీ వైస్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు భీమయ్య, భాగ్య, ముత్తక్క, నర్సయ్య పాల్గొన్నారు.

అల్పాహారం అందించడం అభినందనీయం

- జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

రాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సర్పంచి బొమ్మెల పద్మకిషన్ ఆధ్వర్యంలో అల్పాహారం అందించడం అభినందనీయమని జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. విద్యార్థులకు అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి బలమైన ఆహారం అందిస్తున్న సర్పంచి బొమ్మల పద్మ కిషన్ కృషి ఆదర్శనీయమన్నారు. ప్రతీ గ్రామంలో పెద్దలు పాఠశాలలోని విద్యార్థులకు వివిధ కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలిపారు. నియోజకవర్గంలో విద్యా ప్రమాణాలు పెంచడం కోసం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పనిచేస్తున్నారన్నారు. రాస్పల్లి పాఠశాలలో గణిత శాస్త్ర ప్రయోగశాల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులకు ఏ అవసరం వచ్చినా తమ దృష్టికి తేవాలన్నారు. పదవ తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించాలని కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ఈ సంవత్సరం జిల్లాలో 100 శాతం పదవ తరగతి ఫలితాలు సాధించాలని, రాష్ట్రంలో మొదటి ఐదు వరుసల్లో మన జిల్లాను నిలపాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు జీపీఏ 10 పాయింట్లు తెచ్చుకోవాలని, విద్యార్థులు ఉత్సాహంగా చదవాలని సూచించారు. ఈ సందర్భంగా గత సంవత్సరం ఎన్ఎంఎంఎస్ సాధించిన విద్యార్థులకు, సాంఘిక శాస్త్రం టాలెంట్ టెస్ట్‌లో జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బొమ్మెల పద్మకిషన్, పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు ఏటుకూరి శ్రీనివాసరావు, ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, వైస్ ఎంపీపీ స్వదేశ్ శర్మ, మండల కోఆప్షన్ సభ్యుడు సిద్దిక్, సర్పంచి పవిత్ర ధనరాజ్, ప్రధానోపాధ్యాయుడు హన్మంతు, ఉపాధ్యాయులు లక్ష్మణ్, తంగడిపల్లి రాకేష్, ఇందారపు ప్రకాష్, దివ్యశ్రీ, దెబ్బటి సత్యనారాయణ, రవికుమార్, మహిపాల్, గాయత్రి పాల్గొన్నారు.

5స్టార్ రేటింగ్‌లో ఆర్‌కె-1ఏ గని



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

భారత దేశంలో ఉన్న 504 బొగ్గు గనులకు కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ కోల్ వారు నిర్వహించిన 2019-20 ఏడాదికి స్టార్ రేటింగ్ మైన్‌లో ఫైవ్ స్టార్ రేటింగ్ మైన్‌గా ఆర్కే వన్ ఏ గని అగ్రగామిగా నిలిచిందని బుధవారం ఆర్ కె1ఏ గనిని సందర్శించిన ఫైస్టార్ బృందం ప్రకటించింది. ఈ సందర్భంగా 2021-22 ఏడాదికి గాను స్టార్ రేటింగ్ పర్యవేక్షణ బృందం ఓఎస్డీ-సీసీఓ కొత్తగూడెం డీవీ సుబ్రహ్మణ్యం, జనరల్ మేనేజర్ రామగుండం ఎస్ సాంబయ్య, సేఫ్టీ ఆఫీసర్ రామగుండం పి.మోహన్ రావు, ఓసి1 జనరల్ డా.ఎం.చంద్ర శేఖర్, ప్రొఫెసర్ (హెచ్ఏజీ)ఎన్ఐటీ వరంగల్, అడిషనల్ మేనేజర్ సీపీ అండ్ పీ కొత్తగూడెం దిలిప్ కుమార్లకు ఆర్కే వన్ ఏ గని ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జాన్ ఆనంద్ జీఎం సేఫ్టీ బీపీఏ రీజినల్, మందమర్రి ఏరియా ఎస్ఓటూ జీఎం కృష్ణా రావు, ఏఎస్ఓ ఓదెలు, ఏజెంట్ రామ దాసు, గని మేనేజర్ ఏ.శ్రీధర్ రావు, డీజీఎం, గని రక్షణ అధికారి బి.జయంత్ కుమార్, గని వెంటిలేషన్ ఆఫీసర్ ఏం.వెంకటేష్, గని పిట్ ఇంజనీరు ఏం.సతీష్, గని సర్వేయర్ నజీరుద్దీన్ సీనియర్ అండర్ మేనేజర్ కె.రవి, గని టీబీజీకేఎస్ పిట్ సెక్రెటరీ బండారి బిక్షపతి, ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరి సురిమిళ్ళ వినయ్, కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

అధ్వానంగా మారిన రోడ్లు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలో సంవత్సరాలు గడిచిన రోడ్ల పరిస్థితి మరి అధ్వానంగా మారినా పట్టించుకునే వారు కరువయ్యారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. రామకృష్ణాపూర్ మున్సిపల్ పరిధిలోని రోడ్లు గుంతలమయమై ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ఎటు చూసినా రోడ్లన్నీ అస్తవ్యస్తంగా గుంతలు పడి ప్రమాదాలకు గురవుతున్నా ప్రజాప్రతినిధులు, సంబంధింత అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శలు వెల్లువెత్తాయి. పట్టణంలోని రోడ్లపై నిత్యం కొన్ని వందల వేల వాహనాలు ఏరియా హాస్పిటల్ నుంచి మొదలుకొని మందమర్రి, మంచిర్యాలకి బీజోన్ సెంటర్ అమరవాది రోడ్లపై ప్రయాణించాలంటే ఇక్కడి ప్రజలు జంకుతున్నారు. రాజీవ్ చౌక్ నుంచి విద్యానగర్‌కు వెళ్లే రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రహదారి వెంబడి ప్రయాణించే వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రాయాణించాల్సి వస్తోంది. ఈ గుంతలో పడి గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. కనీసం ప్యాచ్‌వర్క్ అయినా చేయటంలేదని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని స్థానిక ప్రజలు వేడుకుంటున్నారు.

మాదిగ జేఏసీ మండల అధ్యక్షుని నియామకం

జన్నారం : తెలంగాణ మాదిగ జేఏసీ మండల అధ్యక్షునిగా బాదంపల్లి గ్రామానికి చెందిన గంగారెడ్డి నియమితులయ్యారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో మాదిగ జేఏసీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సుందిళ్ల సతీష్ గంగారెడ్డికి నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరిగితేనే మాదిగ, మాదిగ ఉపకులాలకులకు న్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీలలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచి అందులో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం వర్గీకరణ అంశాన్ని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తే కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ చేయకుండా మాదిగ రిజర్వేషన్లు పెంచకుండా మాదిగలను దగా చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ ప్రభుత్వాకి కేంద్రంలో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరిస్తున్నామన్నారు. అన్ని మండలాల్లో గ్రామాల్లో మాదిగ జేఏసీ కమిటీలను వేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ మండల నాయకులు చంద్రశేఖర్, కాంతన్న, శంకర్, సత్తన్న పాల్గొన్నారు.

గ్రామాల్లో కమలా వికాస యాత్ర

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ఆయా గ్రామాల్లో కమల వికాస యాత్రను నిర్వహిస్తున్నామని బీజేపీ ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు హరినాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తపాలపూర్ గ్రామంలోని పలు కాలనీలు ఆదివాసి గిరిజన గూడెంలలో గడపగడపకు పర్యటించిన వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అవినీతి అక్రమాలను వివరించారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం బూత్ కమిటీ సమావేశం నిర్వహించి, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాలను ప్రజల్లో తీసుకువెళ్లాలని కమిటీకి సూచించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కొమురయ్య, మండల శక్తి కేంద్రం ఇన్‌చార్జి బూత్ అధ్యక్షులు బండి రాజన్న, బూత్ అధ్యక్షులు ఏనుగుల రాజేందర్, బూత్ ఉపాధ్యక్షులు చేవులమద్ది చందు, తిమ్మాపూర్ శక్తి కేంద్రం అధ్యక్షులు యుగేందర్, నాయకులు జిల్లా అక్క పెల్లి, పాదం రాకేష్, చందనగిరి తిరుపతి, గుంటుకు రాజన్న, కాసర్ల రాజన్న, మాటేటి సతీష్, అంబడిపెల్లి సత్తన్న, రాజు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



నవతెలంగాణ-జన్నారం

వాహనాలు నడిపేటప్పుడు నిర్లక్ష్యం, అతివేగం తగదనీ, రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని ఎంవీఐ (మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్) రాహుల్ కుమార్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు భద్రత నియమాలు పాటించి క్షేమంగా గమ్య స్థానాలకు చేరాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే శిక్షార్హులు అవుతారన్నారు. నిర్లక్ష్యం అతివేగం అనర్థానికి దారితీస్తుందన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరం అన్నారు. బైకులో వెళ్లేప్పుడు హెల్మెట్, కారులో ప్రయాణించెప్పుడు సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలని చెప్పారు.

'ఆయుష్మాన్ భారత్'ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కోటపల్లి

ఆయుష్మాన్ భారత్‌లో బాగంగా వైద్య పరీక్షలు ఉచితంగా పొందేందుకు గ్రామ ప్రజలు పేరు నమోదు చేసుకోవాలని జనగామ సర్పంచ్ గట్టు లక్ష్మణ్ గౌడ్ అన్నారు. బుధవారం గ్రామ పంచాయితీ భవనంలో సర్పంచ్ గట్టు లక్ష్మణ్ గౌడ్ ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదు కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తుందని దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ తలండి శంకర్ పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో హెచ్ఎంఎస్‌ను గెలిపించండి

నవతెలంగాణ-నస్పూర్

రానున్న సింగరేణి ఎన్నికల్లో హెచ్ఎంఎస్‌ను గెలిపించాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, వేజ్ బోర్డ్ సభ్యుడు రియాజ్ అహ్మద్ అన్నారు. బుధవారం ఆర్‌కే-7 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వైఖరి వల్ల సింగరేణితో సహా దేశంలోని బొగ్గు రంగ సంస్థలన్నీ భవిష్యత్తులో కనుమరుగయ్యే పరిస్థితులు ఉన్నాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన ఎనిమిదిన్నర సంవత్సరాల కాలంలో సింగరేణి సంస్థకు ఒక బొగ్గు బ్లాక్‌ను కూడా అనుమతి ఇవ్వలేదని విమర్శించారు. భవిష్యత్తులో కూడా సింగరేణి సంస్థకు బొగ్గు బ్లాగులు ఇచ్చే అవకాశాలు లేకుండా ఉన్నాయని, ప్రైవేటీకరణ చేయమంటూనే కేంద్రం సింగరేణి సంస్థకు బొగ్గు బ్లాకు కేటాయించకుండా కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ ఉంటే అడ్డుకోవాల్సిన బీఆర్ఎస్ ప్రభుత్వం, బొగ్గు బావులలో అన్ని రంగాల్లో ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించి పనిచేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వల్ల సింగరేణి సంస్థ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో కార్మికుల సంక్షేమానికి కష్టపడే హెచ్ఎంఎస్‌ను గెలిపించాలని కోరారు.

కంటి వెలుగుపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-వేమనపల్లి

మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ కోలి స్వర్ణలత అధ్యక్షతన కంటి వెలుగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ లక్ష్మయ్య మాట్లాడుతూ జనవరి 18వ తేదీ నుండి కంటి వెలుగు రెండవ విడత కార్యక్రమం ప్రారంభం కాబోతున్నందున మండలంలోని కంటికి సంబంధించిన వ్యాధులు ఉన్న వారిని గుర్తించి వెంటనే వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. మొదటగా వయస్సు పైబడిన వారిని గుర్తించి పరీక్షలు నిర్వహించాలని కోరారు. మండల కేంద్రంతో పాటు ప్రతి గ్రామానికి సైతం కంటి వెలుగుపై సమాచారం తీసుకెళ్లాలని కోరారు. గ్రామాలలో క్యాంపు నిర్వహించడానికి వస్తున్న సిబ్బందికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ బాపూరావు, జడ్పీటీసి రుద్రభట్ల స్వర్ణలత, ఎంపీటీసీలు రుద్రభట్ల సంతోష్ కుమార్, దాగామ బాపు, కోఆప్షన్ సభ్యుడు జహేద్ అలీ, సర్పంచులు గాలి మధు, పద్మ, జెల్ల మొండి, పాల్గొన్నారు.

మొర్రిగూడ గ్రామ కార్యదర్శి సస్పెన్షన్

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని మొర్రిగూడ గ్రామ కార్యదర్శి కే.చంద్రమౌళిని సస్పెండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి ఉత్తర్వులు జారీ చేసినట్టు ఎంపీడీఓ అరుణాని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యదర్శి చంద్రమౌళి విధుల్లో అలసత్వం వహిస్తూ ముందస్తు అనుమతులు లేకుండా విధులకు గైరాజరవడంతో అతనిని సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ కార్యదర్శులు సమయ పాలన పాటించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. విధులలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏవీ రెడ్డిని సన్మానించిన బీఎంఎస్

వతెలంగాణ-నస్పూర్



ఆర్ కే 5 ఏజెంట్ ఏ వెంకటేశ్వర రెడ్డి సీఎంఓఏఐ అపెక్స్ కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సందర్భంగా బీఎంఎస్ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల పక్షపాతి, మృదు స్వభావి అయిన ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేష్, వైస్ ప్రెసిడెంట్ పెండ్లి మోహన్ రెడ్డి, ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు వినోద్ కుమార్, పంచర్ల నరేష్, రామగిరి పురుషోత్తమా చారి, పునెం రామకృష్ణ, సురేష్, జీడి ప్రభాకర్, మేకల స్వామి, గోపతి సందీప్, పాగిడి శ్రీకాంత్, కాంపల్లి తిరుపతి పూర్ణచందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మన ఊరు మనబడి పనులను త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-జన్నారం

మన ఊరు మనబడి పనులను త్వరగా పూర్తిచేయాలని మంచిర్యాల జిల్లా సెక్టోరియల్ అధికారి సర్దార్ అలీఖాన్ అన్నారు. బుధవారం మండలంలోని చింతలపల్లి, పోన్కల్, గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మన ఊరు మనబడి పనులను ఎంఈఓ విజయ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. పాఠశాల భవనాలను త్వరగా పూర్తిచేసి, ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు.

ప్రభుత్వ పథకాల అమలుకు సహకరించాలి

నవతెలంగాణ-జైపూర్

ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల అమలుకు స్థానికులు సహకరించాలని తహసీల్దార్ మోహన్‌రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం శివ్వారం, కుందారం, బెజ్జాల గ్రామాలలో పర్యటించారు. శివ్వారం శివారులో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు సంబంధించి గుర్తించిన ప్రభుత్వ భూమిపై స్థానికులకు ఉన్నటువంటి అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మద్దులపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేయతలపెట్టిన క్రీడాప్రాంగణం కోసం అవసరమైన స్థలం అందుబాటులో లేనందున ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. పల్లె ప్రకృతి వనాలలో నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించాలని సూచించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని మల్కేపల్లి గ్రామంలో దొంతుల తిరుపతికి చెందిన ఇల్లు దగ్ధమైంది. ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై మంటలు అంటుకొని పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని సామాగ్రి కాలిపోయింది. ఈ మేరకు తహసీల్దార్ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించారు. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని వివరించారు. ప్రమాద ఘటనను జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు.



నిరాశ పరిచిన మంత్రి పర్యటన

- రోడ్డు వెడల్పు పనులపై మౌనం
- ప్రత్యేక కెనాల్ నిర్మాణంపై దాటవేత

నవతెలంగాణ-ఖానాపూర్ టౌన్

రాష్ట్ర దేవాదాయ, న్యాయ శాఖ మంత్రి ఇంద్రాకరణ్ రెడ్డి బుధవారం ఖానాపూర్‌లో చేసిన పర్యటన స్థానిక ప్రజల్లో నిరాశను నింపింది. గిరిజన భవనం ప్రారంభోత్సవానికి, వివిధ అభివద్ధి పనులపై హామీలస్తారని ప్రజలు ఆశించారు. మంత్రి మాత్రం ఎలాంటి హామీ ఇవ్వకుండా కేవలం గిరిజన భవనాన్ని ప్రారంభించి వెళ్లిపోవడం గమనార్హం. పట్టణంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డు వెడల్పుతో ప్రజలు ఇబ్బంధి పడుతున్నారని, పనులు కొత్త కాంట్రాక్టర్‌తో పూర్తి చేయించాలని ఎమ్మెల్యే రేఖానాయక్ మంత్రికి సభా ముఖంగా విన్నవించారు. దానికి మంత్రి మాత్రం ఎలాంటి హామీఇవ్వకుండా మౌనం వహించారు. ఈ క్రమంలో రోడ్డు వెడల్పు పనులు ఇప్పట్లో కావని తేలిపోవడంతో స్థానిక ప్రజలు నిరాశకు లోనవుతున్నారు. అలాగే పట్టణ సమీపంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీపై ఏదైనా తేదీని ప్రటిస్తారని ఆర్జీదారులు ఆశించారు. వాటి విషయంలోనూ మంత్రి ఎలాంటి ప్రకటన చేయలేదు. కొత్త సదర్ మాట్ ప్రాజెక్ట్ నుంచి పాత ఆనకట్ట వరకు నిర్మించాల్సిన పత్యేక కాలువ గురించి దాటవేసి రబీలో సదర్ మాట్ రైతాంగానికి పూర్తిస్తాయిలో నీరందిస్తామని చెప్పడం గమనార్హం. మంత్రి పర్యటనతో పట్టణంలో పేరుకు పోయిన ప్రధాన సమస్యలు కొలిక్కి వస్తాయని భావిస్తే నిరాశే మిగిలినట్టయిందని స్థానిక నాయకులు, ప్రజలు చర్చించుకోవడం కనిపించింది.

అటవీశాఖ అధికారులపై దాడికి యత్నం

నవతెలంగాణ-ఇచ్చోడ

కవ్వాల్ టైగర్ రేంజ్ అధికారులపై దాడికి యత్నం చేసిన ఘటన బుధవారం మండలంలోని సిరిచెల్మ గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎఫ్ఆర్ఓ వాహబ్ హమ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిచెల్మ గ్రామ శివారులో కవ్వాల్ టైగర్ రేంజ్ పరిధిలో బోర్‌బావి తవ్వడానికి, గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు జేసీబీతో వెళ్లినట్లు పక్క సమాచారంతో కేటీఆర్ రేంజ్ అధికారి వాహబ్ హమ్మద్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నట్టు తెలిపారు. అటవీ భూమిలో బోర్ బావి తవ్వవద్దని హెచ్చరించారు. సిబ్బంది జేసీబీ ఫొటోలు తీసి తిరిగి ఇచ్చోడకు వెళ్లడానికి ప్రయత్నం చేయగా జీబ్‌ను అడ్డుకొని దాడి చేయడానికి ప్రయత్నం చేయగా అక్కడ నుంచి తప్పించుకొని గుండాల, తుమ్మలపడు, దాబా(కె) మీదుగా ఇచ్చోడ చేరుకునట్లు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు ఎఫ్ఆర్ఓ వాహబ్ తెలిపారు.

వైద్యురాలి సేవలు అభినందనీయం



కౌటాల : వైద్యురాలు పల్లవి సేవలు అభినందనీయమని ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అన్నారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో ఎంపీపీ అతిథిగా మాట్లాడారు. 10 ఏండ్ల పాటు పీహెచ్‌సీలో వైద్యసేవలందించి అందరి మన్నలు పొందారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మారుమూల మండలమైన కౌటాలలో అత్యధిక సాదారణ ప్రసవాలు నిర్వహించి మంచిపేరు తీసుకొచ్చారన్నారు. వైద్యసిబ్బందితో కలిసిమెలిసి అన్ని సక్రమగా నిర్వహించారన్నారు. ఉత్తమ సేవలందించి రాష్ట్రస్థాయిలో అవార్డు తీసుకోవడం అభినందనీయమన్నారు. ఉన్నత చదువులు చదవడానికి వెళుతుండగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ సీతారాం నాయక్, ఎంపీడీఓ నస్రుల్లాఖాన్, సర్పంచ్ మౌనీష్, ఉప సర్పంచ్ తిరుపతి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఫ్లయింగ్ స్క్వాడ్‌పై దాడిని ఖండిస్తున్నాం'

ఆదిలాబాద్‌టౌన్: డిగ్రీ పరీక్షల్లో కాపీ కొడితే డిబార్ చేశారన్న అక్కసుతో ఇచ్చోడలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ప్రయాణిస్తున్న కారుపై జరిగిన రాళ్ల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆదిలాబాద్ స్టాఫ్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణగా ఉండి పరీక్షలు రాయాల్సింది పోయి, కాపీ కొడుతూ దొరికితే అధికారులను బెదిరించడం, వారిపై రాళ్ల దాడులు చేయడం క్షమించరాని నేరమని తెలిపారు. ఇలాంటి విద్యార్థులను శాశ్వతంగా డిబార్ చేయాలని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, అబ్జర్వర్ల రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. మాస్ కాపీయింగ్ ప్రోత్సహిస్తున్న కళాశాలలపై కూడా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

రెబ్బెన : బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని సింగరేణి హైస్కూల్‌లో ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా విద్యార్థులకు ఇంధన పొదుపుపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం సీనియర్ పర్సనల్ అధికారి జీకె కిరణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు సంతోష్ సహజ వనరుల లభ్యత, వినియోగంపై అవగాహన కల్పించారు. వ్యాసరచనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 12 గురువారం జీఎం చేతుల మీదుగా బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్ రెడ్డి, షాజొద్దీన్, సమత, పద్మావతి, అధికారులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ నాయకులకు సన్మానించిన డీఈఓ

ఆదిలాబాద్‌టౌన్ : ఇటీవల టీఎన్జివోస్ జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన సంద అశోక్, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎడ్ల నవీన్ కుమార్, ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన రాజేశ్వర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత సన్మానించారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వారిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీ నర్సిములు, కార్యాలయం సూపరింటెండెంట్లు వెంకటరమణ, మధుసూదన్ రెడ్డి, సిబ్బంది రాజేశ్వర్, రవికుమార్, మహేష్, తుషార్, సతీష్, నిఖిల్, అబ్దుల్, అక్బర్ ఉన్నారు.

రబీంద్రలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

ముథోల్: మండల కేంద్రంలోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీ నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాయినాథ్, కరస్పాడెంట్ రాజేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

కాసిపేట : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లతో పాటు 7,8,9,10 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 6వ తరగతికి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 16న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి వారికి మధ్యాహ్నం 2 నుంచి 4గంటల ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హైమన్‌డార్ఫ్ దంపతులతోనే

ఆదివాసులకు ప్రపంచస్థాయి గుర్తింపు

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎంపీ సోయం బాపురావు, కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఘనంగా 36వ డార్ఫ్ దంపతుల వర్ధంతి వేడుకలు
- జీవో నెం.3, పోడు పట్టాలపై బీజేపీ, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం



నవతెలంగాణ - జైనూర్

ఆదివాసులను ప్రపంచానికి చాటిచెప్పిన ఘనత ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ దంపతులదని జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎంపీ సోయం బాపురావు అన్నారు. బుధవారం మండలంలోని మార్లావాయి గ్రామంలో ప్రతి ఏడాది నిర్వహించే హైమన్‌డార్ఫ్, బెటీ ఎలిజబెత్ దంపతుల 36వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివాసులు సంస్కృతి సాంప్రదాయాలతో ఘనంగా నివాళులర్పించారు. వర్ధంతి కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్, ఎంపీ సోయంతో పాటు కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, ఎస్పీ సురేష్‌కుమార్, మాజీ ఎంపీ గొడం నగేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, ఖానాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ యువ నాయకుడు వెడ్మ బొజ్జు హాజరయ్యారు. వీరికి సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేష్, గ్రామస్తుల ఆధ్వర్యంలో పుష్పగుచ్చాలు అందజేసి డోలు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు నూతన గృహాన్ని ప్రారంభించారు. అనంతరం బేటీఎలిజబెత్ దంపతుల సమాధి వద్దకు వెళ్లి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ నైజాం ప్రభుత్వానికి ఆదివాసుల స్థితిగతులపై ప్రత్యేక నివేదికలు ఇచ్చారన్నారు. ఆదివాసీ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసులకు రాబోయే తరానికి న్యాయం చేయాలని, అప్పటి ప్రభుత్వానికి నివేదికలు పంపించారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆదివాసులకు ఐటీడీఏ ద్వారా అందుతున్న పథకాలు వారి చొరవే అని తెలిపారు. ఆదివాసుల కోసం తమ జీవితం ఈ ప్రాంత ప్రజలకే అంకిత చేశారని తెలిపారు.

జీవో 3, పోడు భూములపై కేంద్రం అన్యాయం

జీవో నెం.3, పోడు భూముల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం ఆదివాసులకు అన్యాయం చేస్తోందని మాజీ ఎంపీ గొడం నగేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో 3ను ఎన్నోసార్లు సవరించాలని తెలిపినా ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం సవరించడం లేదని, దానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలిపారు. ఇప్పటి వవరకు మార్లావాయి గ్రామంలో కేవలం 13 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉండడం దారుణమని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ నేటి ఆదివాసీ సమాజం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరు విద్యావంతులు కావాలని తెలిపారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విద్యావంతులైతేనే ఉన్నత శిఖరాలకు ఎదగొచ్చని తెలిపారు. జిల్లాలో అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా ఆదివాసీ యువత కోసం ఇంటర్ చదివిన అనంతరం ఎంసెట్‌లో ర్యాంకు పొందాలని స్టడీ సర్కిల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఐటీడీఏ ద్వారా అన్ని రంగాల్లో గిరిజనులకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తున్నామని ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి తెలిపారు. ఐటీడీఏ ద్వారా నిర్వహిస్తున్న ప్రతి కార్యక్రమంలో ఆదివాసులకు అన్ని విధాలుగా న్యాయం చేస్తున్నట్టు పేర్కొన్నారు.

తెలంగాణ సీఎస్‌తోనే ఆదివాసులకు అన్యాయం

తెలంగాణ సీఎస్‌గా పని చేసిన సోమేష్‌కుమార్ నిర్లక్ష్యంతోనే ఆదివాసులకు అన్యాయం జరిగిందని ఎంపీ సోయం బాపురావు అన్నారు. కొన్ని నెలల క్రితం తానే స్వయంగా సచివాలయంలో సీఎస్‌ను కలిసి జీవో 3, పోడు భూముల సమస్యలపై కలిశానన్నారు. ఆయన నిర్లక్ష్యం చేయడం వల్లనే నేడు ఆదివాసులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సీఎం దృష్టికి ఈ విషయం తీసుకెళ్లి న్యాయం చేయాలని తెలిపారు.

ఆదివాసులపై ప్రేమ ఉంటే గంటసేపు ఆగరా?

ఆదివాసులపై ప్రేమ ఉంటే కార్యక్రమంలో కనీసం గంటసేపు కూడా ఉండరా? అనిఎంపీ సోయం బాపురావును ఉద్దేశించి జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. ఆదివాసుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్యక్రమానికి వచ్చి పది నిమిషాల్లో అబద్దాలు మాట్లాడిపోవడం సరైన పద్ధతి కాదని ఎంపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నేటి వరకు ఆదివాసీ సమాజానికి ఏ ఒక్క మంచి పని చేయలేదని, ప్రధానమంత్రి దృష్టికి ఆదివాసుల సమస్య ఏమి తీసుకెళ్లారో చెప్పాలని ప్రశ్నించారు.

వర్ధంతి సభలో ప్రత్యేక బహుమతులు

వర్ధంతి సభలో వారం రోజుల నుండి నిర్వహిస్తున్న కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాజేశం, డీఎస్పీ సత్యనారాయణ, తహసీల్దార్ సమీర్‌హైమద్, ఎంపీడీఓ ప్రభుదయ, ఏపీఎం సుజాత, వైస్ ఎంపీపీ చిర్లె లక్ష్మణ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్నాక విజయ్, ఆదివాసీ సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





పత్తి క్వింటాల్‌కు రూ.10వేలు చెల్లించాలి

- జాయింట్ సమావేశంలో సీపీఐ(ఎం) డిమాండ్



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పత్తి క్వింటాల్‌కు రూ.10వేలు చెల్లించాలని, కొనుగోలులో సీసీఐ పాల్గొనాలని సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ నటరాజ్, వ్యవసాయ మార్కెట్, సీసీఐ అధికారులతో సీపీఐ(ఎం) బృందం బుధవారం సాయంత్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో జాయింట్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటకు మద్దతు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కొనుగోలులో సీసీఐ తక్కువ ధర చెల్లిస్తుండడంతో ఇదే అదునుగా ప్రైవేటు వ్యాపారస్తులు సైతం తక్కువ ధర చెల్లిస్తున్నారని తెలిపారు. పక్కన మహారాష్ట్రలో రూ.8,500తో కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడ మాత్రం రూ.7,960 మాత్రమే ధరతో కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఈ ధరతో పెట్టుబడి సైతం లభించే పరిస్థితి లేదన్నారు. రూ.10వేలు చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.సురేందర్, నాయకులు మోహన్ పాల్గొన్నారు.

13,14న టీఎస్‌యూటీఎఫ్ మహాసభలు

నవతెలంగాణ - దహెగాం

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ బలోపేతం దిశగా జరిగే ఈ రాష్ట్ర మహాసభలకు ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, విద్యాభిమానులు రావాలని కోరారు. ఈ నెల 13, 14వ తేదీల్లో రంగారెడ్డి జిల్లా మన్నెగూడ సాగర్‌రోడ్డులోని బీఎంఎస్ కన్వెన్షన్‌లో మహాసభలు జరుగుతాయన్నారు. మొదటిరోజు మహా ప్రదర్శన, రెండో రోజు బహిరంగ సభ ఉంటుందని, ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో పాటు విద్యావేత్తలు శైలజ, నాగేశ్వర్‌రావు, చుక్క రామయ్య, అలుగుబెల్లి నర్సిరెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ నాయకులు అశోక్, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్‌ను మండలాధ్యక్షుడు, జిల్లా కోకన్వీనర్ కత్తిపాక చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను తిరిగి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి వినేశ్, ఉపాధ్యాయులు లక్ష్మణ్, అరుణ, తిరుమల, హేమలత పాల్గొన్నారు.



గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి

నవతెలంగాణ-ఉట్నూర్

గ్రామస్థాయి నుంచి బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కందుకూరి రమేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని వజీర్‌పూర కాలనీలో బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ సభ్యులు పర్యటించి సమావేశం నిర్వహించారు. బూత్ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు కందుకూరి రమేష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ మండల ప్యాక్స్ చైర్మెన్ సామ ప్రభాకర్ రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షులు అహ్మద్ అజీమొద్దీన్, జిల్లా రైతు కమిటీ సభ్యులు కామెరి పోషన్న, మాజీ ఎంపీటీసీలు మనోహర్, లక్ష్మిపతి, నాయకులు ఆశన్న, బల్వంత్, సతీష్ పాల్గొన్నారు.

మరాఠి మీడియం పాఠశాలలో ముగ్గుల పోటీ



ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని స్థానిక భుక్తాపూర్ మరాఠి మీడియం ప్రభుత్వ పాఠశాలలో సంక్రాంతి పండగ పురస్కరించుకుని బుధవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులు వేశారు. ఉపాధ్యాయులు పండగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గణేష్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులతోనే ఉద్యోగాల భర్తీ

జైపూర్ : సింగరేణి సంస్థలో గిరిజనుల కోసం కేటాయించిన 665 బ్యాక్‌లాగ్ పోస్టులతో పాటు ఇతర 400 ఉద్యోగాలు గిరిజన నిరుద్యోగులతో భర్తీ చేసుకోగలిగామని సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పంతుల నాయక్ పేర్కొన్నారు. బుధవారం జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో చీఫ్ టెక్నికల్ కన్సల్టెంట్ (సీటీసీ) సంజయ్ కుమార్ సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిటిసి సంజయ్ కుమార్ మాట్లాడుతూ సింగరేణిలో గిరిజన ఉద్యోగుల సంఘం ఉత్సాహంగా పనిచేస్తుందని, గిరిజనుల హక్కుల సాధన కోసం నిరంతరాయంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ జనరల్ మేనేజర్ డివిఎస్ సూర్యనారాయణ రాజు, చీఫ్ ఆఫ్ (ఓఅండ్‌ఎం) జేఎన్ సింగ్, జిఎం (పిసిఎస్) రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఎస్ఈ అజ్మీర భీమాతోపాటు సింగరేణి ఎస్‌టిపిపి ఇతర విభాగాలకు చెందిన అధికారులు, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 24 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్ : ఉమ్మడి ఆదిలాబాద్‌లో కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బుధవారం జరిగిన డిగ్రీ పరీక్షల్లో ఉమ్మడి జిల్లాలో 24 మంది డిబార్ అయినట్లు కాకతీయ యూనివర్సిటీ పరిక్షల విభాగం అదనపు అధికారి డా.నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇచ్చోడలోని సాయి సమత్ డిగ్రీ కళాశాలలో పదకొండు మంది, ఇచ్చోడ వివేకానంద డిగ్రీ కళాశాలలో ఏడుగురు, భైంసాలోని జీపీఎల్ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, ఇచ్చోడ కాకతీయ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఒక్కరు చొప్పున డిబార్ అయ్యారు.

వంజరి సమాజాభివృద్ధికి కృషి

నార్నూర్ : వంజారి సమాజాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కేంద్ర ఒబీసీ కమిషన్ చైర్మన్ హంసరాజ్ గంగారం హయర్ అన్నారు. బుధవారం తడిహత్నూర్ గ్రామంలో దాదారావ్ పాటిల్ వర్ధంతి సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వంజరి సంఘం నాయకులు వినతి పత్రం అందించి పలు సమస్యలు వివరించారు. ఏజెన్సీ ఏరియాలోని నెలకొన్న విద్యా, వైద్య, రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు పరోక్షంగా కృషి చేస్తానని హామి ఇచ్చారు. జరుగుతున్న అన్యాయం గురించి ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. సమావేశానికి టీజీఓ అధ్యక్షుడు శ్యాం నాయక్, చంద్రపూర్ జడ్పీటీసీ సురేష్ కేంద్రే, తెలంగాణ వంజారి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ చకోర్, గ్రామ ఉప సర్పంచ్ విష్ణు ఫడ్, బీజేపీ నాయకుడు విశాల్ కేంద్రే, శివాజీ యూత్ ప్రసిడెంట్ రవి ఫడ్, నాయకులు బాలాజీ కెంద్రే మహాదవ్, ఉద్దవ్, గణపతి కేంద్రే పాల్గొన్నారు.

గుర్తు తెలియని మతదేహం లభ్యం

ఉట్నూర్ : గుర్తు తెలియని మృతదేహం బుధవారం లభ్యమయినట్లు ఎస్సై భరత్ సుమన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పులిమడుగు గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో 50 ఏళ్ల వ్యక్తి చెట్టుకు సుమారుగా 20 రోజుల క్రితమే ఉరివేసుకొని ఆత్మహత్య చెందినట్లు తెలిపారు. అటుగా వెళ్లిన పులిమడుగు గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని తెలుసుకున్నారు. మృతుడు ఆత్మహత్య చేసుకున్నాడా, హత్య జరిగిందదా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

కుభీర్: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని ఎస్సై ఎండీ షరీఫ్ అన్నారు. బుధవారం మండలంలోని బెల్గాం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా విద్యార్థులకు గ్రామంలో యువకులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎస్సై షరీఫ్ హాజరై పోటీలను ప్రారంభించారు. ముందుగా క్రీడా మైదానంలో స్థానిక సర్పంచ్ బాలేరావు శంకర్, గ్రామస్తులతో కలిసి క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువకులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. అదే విధంగా యువత క్రీడలో మంచి పట్టు సాధించి విజేతలుగా నిలువాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కవిరాజ్, స్థానిక సర్పంచ్ శంకర్, అనిల్, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికా శిక్షణ

ముథోల్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించిన అభివృద్ధి ప్రణాళికపై పంచాయతీ కార్యదర్శులు, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులకు డీఎల్పీఓ శివకృష్ణ శిక్షణ ఇచ్చారు. అభివృద్ధి ప్రణాళిక తయారీకి గ్రామంలో ఖర్చు చేయాల్సిన అన్ని శాఖల నిధులను పరిగణలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా అభివృద్ధి ప్రణాళికను గ్రామసభలో ఆమోదించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్ బాబు, ముథోల్, బాసర మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఏపీఎం అశోక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రాజేష్, ఏఓ అజ్మీర భాస్కర్ పాల్గొన్నారు.